సురేష్‌కిప్పుడు భయం కలగలేదు. తన యాక్సిడెంట్ జరిగే స్టేజ్ నిన్నటితో దాటిపోయింది. ఇవాళ్టి నుంచీ తను నిజం అర్జున్‌గా చలామణీ అయిపోతున్నాడు. కనుక ఇప్పుడు తనకేం జరిగినా వారికే నష్టం!

"మీలాంటి అందమైన యువతి ప్రమాదాల గురించి కాక ఇంకేమైనా అందమైన విషయాల గురించి మాట్లాడితే బావుంటుంది" నవ్వుతూ అన్నాడు.

ఆమె చురుక్కున చూసింది.

"మీ హద్దుల్లో వుండండి. లేకపోతే విష్ణు మృగబలం రుచి చూడాల్సి వస్తుంది."

అతనికి నవ్వొచ్చింది.

"మీరు వచ్చేముందే నేను కొట్టిన దెబ్బకు రెండు చేతులూ ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు. రెండు నిమిషాలపాటు"

ఆమె నవ్వేసింది.

"ఇలా కూర్చో!" అంది తను సోఫాలో వెనక్కు జారగిలబడుతూ.

అతనికి ఆమెలో సడెన్ మార్పు కనిపించింది. తను చాలామంది అమ్మాయిల్లో గమనించిన మార్పే అది. తను అతిగా ట్విస్టింగ్‌గా మాట్లాడినప్పుడు కనిపించే మార్పే.....

ఆమె సోఫాలోనే మరోమూల కూర్చున్నాడతను.

"నన్ను మీరు కొనుక్కున్నారు మేడమ్! అంచేత నాతో ఎలాంటి సర్కస్ కావాలన్నా చేయించుకోగలరు. అఫ్‌కోర్స్... నేనేమీ కంప్లెంట్ చేయటంలేదు."

"మీరు హర్ట్ అయినట్లున్నారు సురేష్ ! మిమ్మల్ని ఇన్సల్ట్ చేయటం కాదు నాక్కావల్సింది. ఇది చాలా ముఖ్యమైన జాబ్. ఈ జాబ్ మీరు ఎంత జాగ్రత్తగా నిర్వర్తిస్తే అంత మంచిది. అందుకని కొంచెం రూడ్‌గా వుండవలిసి వస్తోంది ."

"మీకో విషయం చెప్పమంటారా?"

"ఏమిటది?"

"బయటికొచ్చాక నన్ను సురేష్ అని పిలవటం మంచిదికాదేమో- మీ భర్తను ఎలా పిలుస్తారో అలాగే నన్నూ పిలిస్తే..... ఎలాంటి ప్రాబ్లెమ్స్ వుండవు."

ఆమె ప్రవర్తనలో మరింత మార్పు కనిపించింది. మరింత రిలాక్స్‌డ్‌గా, తన మీద అభిప్రాయం మార్చుకున్నట్లుగా-

"యూ ఆర్ కరెక్ట్! నేను అతన్ని 'అర్జున్' అనే అంటాను. అతను నన్ను 'మధూ' అంటాడు."

"ఓ.కె.- మధూ! ఇంకేమైనా మాట్లాడాల్సి వుందా?"

ఆమెకు కోపం నవ్వూ రెండూ వచ్చినాయ్....

అప్పుడు కనిపించింది- ఆమె కళ్ళల్లో ఆహ్వానం! రాజ్యలక్ష్మి కళ్ళల్లోనూ, ప్రత్యూష కళ్ళల్లోనూ, గంగాభవాని కళ్ళల్లోనూ కనిపించిన ఆహ్వానం! తను ఎక్స్‌పర్ట్ ఆ విషయంలో! ఆ ఆహ్వానాన్ని ఎంతో లాఘవంగా గుర్తుపట్టగలడు. కళ్ళలో ఆహ్వానంతోపాటు ఆమె శరీరపు వంపులూ, ఆమె అందం- అన్నీ స్వాగతం పలుకుతున్నయ్...

అతికష్టం మీద తనను తను అదుపులో పెట్టుకున్నాడతను.

"సాయంత్రం మనం డిన్నర్ కెళుతున్నాం- హోటల్ బంజారాలో. అక్కడ చాల జాగ్రత్తగా మసులుకోవాలి. అర్జున్‌కి పరిచయం వున్న వారంతా పలుకరిస్తారు- యూ హావ్ టూ మానేజ్- అఫ్‌కోర్స్ నేను పక్కనే వుంటాను- మనకు సమీపంలోనే విష్ణు కూడా వుంటాడు"

"నా మీద పూర్తిగా నమ్మక ముంచండి! అయ్ కెన్ ఈజీలీ మానేజ్."

"ఐ హోప్ సో!" ఆమె లేచి నిలబడింది.

"ఐ హోప్ సో!" అంది చిలుక కూడా.

ఆమె వెళ్ళిపోగానే విష్ణు లోపలికొచ్చాడు.

"లక్కీ ఫెలో ! మేడమ్ సమయానికి లోపలికొచ్చింది గనుక బ్రతికి పోయావ్! లేకపోతే నెత్తురు కక్కుతుండేవాడివి ఈ పాటికి" అన్నాడు కసిగా.

"నష్టం ఎవరికి?" చిరునవ్వుతో అడిగాడు సురేష్.

"నీ అతితెలివి నా దగ్గర ప్రయోగించకు మరోసారి" కోపం అణచుకుంటూ అన్నాడు.

"దట్స్ ఓ.కె.! బయట వెయిట్ చెయ్- అవసరమైతే పిలుస్తాను"

ప్రత్యూష ఓ ఫైల్‌తో లోపలి కొచ్చింది.

"సిడౌన్ ప్రత్యూషా! నీ గురించి ఏదయినా చెప్పు ఈ జాబ్‌లోకెలా వచ్చావు?"

ఆమె ఆశ్చర్యంతో చూసింది. కుర్చీలో కూర్చోడానికి సందేహిస్తోంది.

"కూర్చో ప్రత్యూషా!" కూర్చుంది,

ఆమె కళ్ళల్లో కలవరపాటు! తన గొంతు ఎక్కడో విన్నట్లనిపినిస్తూండి వుంటుంది బహుశా!

"జీతం స్కేల్ చాలా ఎట్రాక్టివ్‌గా వుంటుంది! అందుకని అప్లై చేశాను."

"నేను నిన్ను సెలక్ట్ చేసుకున్న కారణం కూడా అదే! చాలా ఎట్రాక్టివ్‌గా వున్నావు".

ఆమె తెల్లబోయింది.

విష్ణు చటుక్కున లోపలికొచ్చాడు.

ఆమె ఫైల్ తీసుకుని తడబడుతున్న అడుగులతో బయటికి నడిచింది.

"సురేష్! నీకిది లాస్ట్ వార్నింగ్ ! అతిగా ఎవరితోనూ మాట్లాడకు"

"నాకు తెలుసు నేనెవరితోనూ......."

"ప్రత్యూషతో నువ్వు మాట్లాడిన మాటలు వెనుక గదిలో నుంచి వింటూనే వున్నాను. గదిలో ఏ చిన్న శబ్దమైనా అక్కడ స్పష్టంగా వినబడే ఏర్పాట్లున్నాయ్".

ఇంటర్‌కమ్ ఫోన్ మోగింది.

"సర్ ! జనరల్ మేనేజర్ మెహతా వచ్చారు. అపాయింట్‌మెంట్ వుంది"

"పంపించు"

మెహతా లోపలికొచ్చి వినయంగా నమస్కరించాడు.

"కూర్చోండి"

మెహతా కూర్చున్నాడు.

"ఆర్‌బిఐ వాళ్ళ ఇన్స్‌పెక్టర్ వచ్చారు

సార్ ! ఎవరో మన విషయంలో కంప్లైంట్ యిచ్చినట్లున్నారు"

"డోంట్ బాదర్ వాళ్ళు అడిగిన రికార్డ్స్ చూపించండి! మిగతా విషయాలు తర్వాత చూసుకుందాం"

తనే ఇంటర్‌కమ్‌లో ప్రత్యూషను పిలిచాడు.

"నెక్ట్స్ అపాయింట్‌మెంట్ ప్లీజ్"

మెహతాకి అర్థమైంది.

"నేను వెళతాను సర్! థాంక్యూ!"

అతను వెళ్ళిపోయాడు. విష్ణు నవ్వాడు. "ఈ ఉద్యోగం రాకపోతే నువ్వు పెద్ద ఇంటర్నేషనల్ చీట్‌గా తయారయ్యేవాడివి!"

"మైండ్ యువర్ బిజినెస్"

తలుపు తెరచుకుని ముసలతను లోపలికొచ్చాడు. అతని చేతిలో ఫైల్ వుంది. సురేష్ ఫైల్ అందుకుని చూశాడు. ఏమీ అర్థం కావటం లేదు. ఎకౌంట్స్‌కి సంబంధించిన వ్యవహారం లాగుంది.

"కీపిట్ హియర్ రేపు చూస్తాను" అన్నాడతనితో.

"ఎస్సర్" అనేసి వెళ్ళిపోయాడతను.

"భోజనం టైమయింది సర్! ఇంటికెళ్దామా?" అడిగాడు విష్ణు. అతని గొంతులో హేళన ధ్వనిస్తోంది.

"ఓ. కె!"

ఇద్దరూ ఆఫీస్ బయటికొచ్చారు. సెక్యూరిటీ వాళ్ళు గన్స్‌తో సిద్ధంగా నిలబడ్డారు. కారు శరవేగంతో యిల్లు చేరుకుంది.

తన గదిలోకి చేరుకున్నాడు సురేష్. భోజనం సిద్ధంగా వుంది. అన్నీ నోరూరించే

వంటకాలే! రకరకాల కూరలు. స్వీట్స్. అయిస్‌క్రీమ్స్ అన్నీ వున్నాయ్. ఒక్కసారిగా ఆకలి విజృంభించింది ఆ వంటకాలు చూస్తుంటే.

త్వరత్వరగా భోజనం చేయసాగాడతను.

క్లోజ్‌సర్క్యూట్ టి.వి లో వీడియో పిక్చర్ జరుగుతోంది . ఇంగ్లీష్ పిక్చర్! అడవుల్లో ఫైటింగ్ జరుగుతోంది. హీరోకి, పోలీసులకూ.

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.

కలలో తను మాధురి వెంట పరుగెడుతున్నాడు. ఆమెకు అతి సమీపంగా చేరుకున్నాడు మరో రెండడుగుల్లో ఆమెను పట్టుకుని కౌగిలించేసుకుంటాడు. అప్పుడు లేపాడు విష్ణు.

"కలలు తర్వాత, త్వరగా రడీ అవ్! డిన్నర్‌కి టైమవుతోంది."

ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు సురేష్. మాధురితో సరదాగా గడిపే అద్భుత అవకాశం అది!

త్వరత్వరగా డ్రెస్ చేసుకుంటూంటే మాధురి వచ్చింది గదిలోకి. ఆమె చేతిమీద చిలుక లేదిప్పుడు. ఇంగ్లీషు బ్లూ చీర చక్కగా అమిరిందామెకి. పల్చని చీరలో నుంచి ఆమె శరీరం కనబడి మతిపోగొడుతోంది.

"ఆ సూట్ బావుండలేదు. కాఫీ కలర్ డ్రస్ వేసుకో నీకు బాగా సూటవుతుంది"

కాఫీ కలర్ సూట్ వేసుకున్నాడతను.

"త్వరగా పద! లేకపోతే ఆలస్యం అయిపోతుంది" ఆమె బయటకు నడిచింది. కారు బంజారా చేరుకుంది.

రంగురంగుల దీపాలంకరణతో వెలిగిపోతోందా ప్రదేశమంతా.

"వెల్ కమ్ మిస్టర్ అండ్ మిసెస్ అర్జున్ " అన్న నియాన్ లైట్లు వెలిగి ఆరుతున్నాయ్.

కారు దిగగానే చాలా మంది వచ్చి గుమిగూడారు ఆడా మగా......

సురేష్‌కి కన్నుల పండుగగా వుంది. అర్థనగ్నంగా విదేశీ ఫ్యాషన్ దుస్తుల్లో కనబడుతున్న అతిథులు అందరూ పలుకరిస్తున్నారు. నవ్వుతున్నారు. విష్ చేస్తున్నారు.

రూఫ్ గార్డెన్ మరింత సుందరంగా వుంది. అల్లుకుపోయిన తీగమొక్కలూ, రంగురంగుల క్రోటెన్స్.

సురేష్ కళ్ళన్నీ మాధురి మీదే వున్నాయ్. ఇదే తగిన సమయం చనువు తీసుకోవటానికి. తప్పుబట్టే అవకాశం వుండదామెకి. ఎందుకంటే యిక్కడ ఆ నటన అవసరం.

గ్రే కలర్ జుట్టు ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు.

"ఓ!" అంటూ ఆశ్చర్యంగా నటిస్తున్నాడు సురేష్ .

మాధురి యువతితోపాటు వచ్చింది. చైనీస్ అమ్మాయిలా చిన్నకళ్ళతో, వింత అందంతో కనబడుతోందామె.

"జయంతి గుర్తుందా అర్జున్ ! మద్రాసులో కలుసుకున్నాం"

సురేష్ ఆమెవంకే కళ్లప్పగించి చూస్తున్నాడు. పూర్తిగా సెక్స్ నిండిపోయి వుంది ఆమె గుండెల్లో! తనింతమందిని చూశాడుగానీ....

"ఎలా మర్చిపోతాను. మర్చిపోదామన్నా ఆమె బాడి మర్చిపోనివ్వదు " నవ్వుతూ అన్నాడు

ఆమె విరగబడి నవ్వింది. మాధురి కళ్ళల్లో అసూయ లీలగా కదిలింది.

సురేష్ యిద్దరి భుజాల మీద చేతులేసి యిద్దరినీ దగ్గరగా హత్తుకుంటూ బఫే డిన్నర్ ఏర్పాటు చేసిన టేబుల్ వేపు నడిచాడు. ఇద్దరి శరీరాలూ మెత్తగా, వేడిగా తగిలి కోటి మెగావాట్ల విద్యుత్‌ని జనరేట్ చేస్తున్నాయ్.

"అయ్ థింక్ యూ ఆర్ 34-26-30" జయంతి చెవిలో అన్నాడతను.

ఆమె నవ్వి అతని చేతిని తప్పించుకుని తుళ్ళి తుళ్ళి నవ్వసాగింది.

మాధురి కూడా అతని చేయి తొలగించడానికి ప్రయత్నించింది. కానీ ఆమెను మరింత గాఢంగా తను హత్తుకున్నాడు సురేష్ .

"స్టాప్ దిస్ నాన్సెన్స్" రహస్యంగా అందామె.

"మీరు నిజంగా మనస్ఫూర్తిగా ఇది నాన్సెన్స్ అనేట్లయితే ....వదిలేస్తాను"

అతని చేయి ఆమె నడుము వెనుక నిమురుతోంది. ఆమె పెదాల మీద నవ్వు కవ్వించే నవ్వు.

విష్ణు దూరంనుంచి నోరు తెరచి చూస్తున్నాడు.

"ఎక్స్ క్యూజ్ మీ సార్! ఒక స్నాప్!" ఫోటో గ్రాఫర్ ఎదురుగ్గా వచ్చాడు.

మాధురి సురేష్ నడుము చుట్టూ చేయి వేసింది. "స్టెడీ ప్లీజ్ !" అంతా నవ్వులు, కోలాహలం . హఠాత్తుగా ప్రమాదాన్ని పసిగట్టాడు అతను.

ప్రమాదం....

అది కెమెరామెన్ ముఖంలో స్పష్టంగా అగుపించించి సురేష్‌కి.

ఫ్లాష్ స్థానంలో మరేదో పరికరంలా కనబడుతోంది. కెమెరా 'క్లిక్' మంది. అతను భయంగా చూస్తున్నాడు. ఫ్లాష్ వెలగలేదు. కానీ దాని స్థానంలో పెద్ద శబ్దం.

చటుక్కున పక్కకు వరిగాడు. అప్పటికే ఆలస్యం అయింది. భుజంలో దిగింది గుండు!

"అబ్బా!" బాధతో విలవిలలాడుతూ అరిచాడు. వెచ్చగా చేతిమీద నుంచి రక్తం ప్రవహిస్తోంది.

విష్ణు ఫోటోగ్రాఫర్ వేపు దూకాడు. ఫోటో గ్రాఫర్ కెమెరా విష్ణు ముఖం మీదకు విసిరాడు. సరిగ్గా అప్పుడే కరెంట్ పోయింది. అంతా అంధకారం.

కెవ్వున కేకలు, త్రొక్కిసలాట భయాందోళనలతో అరుపులు. ఎవరో పరుగుతో బలంగా ఢీ కొన్నారు అక్కడే కుప్పగా కూలిపోయాడు సురేష్ .

ఆ తరువాతేం జరిగిందో తెలీదు.

తిరిగి స్పృహలోకొచ్చేసరికి తన గదిలో మంచం మీద వున్నాడు. ఎదురుగ్గా మాధురి, విష్ణు నిలబడి తన ముఖంలోకి చూస్తున్నారు. వాళ్ళు ముఖాలలో ఆత్రుత, ఆందోళన ఏమీలేవు ! సోఫాలో కూర్చున్న డాక్టర్ లేచి దగ్గరికొచ్చాడు.

భుజం మీద గునపం దిగినట్లు బాధ..........

“నొప్పిగా వుందా?” అడిగింది మాధురి.

“ఊఁ”

“సారీ! అనుకోని సంఘటన యిది!” ఆమె గొంతులో కనబడుతోన్న జాలి ముఖంలో కనిపించటంలేదు.

“ఇంకోసారిలా జరగదు” అన్నాడు విష్ణు.

అతనికి వాళ్ళ మాటలు వినిపించటం లేదు. లోలోపల ఆలోచనలు అగ్నిపర్వతంలా బ్రద్దలవుతున్నాయ్.